ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి 7లో..
రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి 7లో..



ఇంటిలోని సామానులను కిందకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది



భవనాన్ని కూల్చివేస్తున్న ఎక్స్‌కావేటర్



నేలవాలుతున్న భవనం



నేలమట్టం అయిన భవనం

అక్రమ కట్టడం కూల్చివేత

- ఐదంతస్తుల భవనం
- ఏడున్నర గంటల్లో నేలమట్టం

నస్పూర్, సెప్టెంబరు 19: సమయం గురువారం ఉదయం ఆరు గంటలు... నస్పూర్ కలెక్టరేట్ రోడ్డులోని టీబీజీకేఎస్ మాజీ నేత డికొండ అన్నయ్య ఇంటికి రెవెన్యూ, పోలీసు సిబ్బంది చేరుకున్నారు... భవనాన్ని కూల్చివేస్తామని, ఇళ్ళు ఖాళీ చేయాలని సూచించారు... కుటుంబ సభ్యులు కూల్చివేతను అడ్డుకోవడంతో అన్నయ్యతోపాటు కుటుంబసభ్యులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇంటిలోని సామగ్రిని మున్సిపల్ సిబ్బంది సహకారంతో కిందకు తరలించారు... అనంతరం రెండు ఎక్స్‌కావేటర్‌తో ఐదంతస్తుల భవనం కూల్చివేత పనులు ప్రారంభించారు. ఉదయం ఆరు గంటలకు మొదలైన కూల్చివేత మధ్యాహ్నం రెండు గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు కొనసాగాయి. జిల్లాలో తొలిసారిగా ఐదంతస్తుల భవనాన్ని కూల్చి వేస్తుండడం, జాతీయ రహదారికి సమీపంలో కూల్చివేత జరుగుతుండడంతో స్థానికులతోపాటు ప్రయాణికులు పెద్ద ఎత్తున గుమిగూడారు. పోలీసులు భవనం సమీపంలోకి ప్రజలు రాకుండ కట్టడి చేశారు. కూల్చివేత చివరి దశలో పిల్లర్ పగులగొడుతుండగా ఒక్కసారిగా భవనం కుప్పకూలింది. పెద్ద ఎత్తున దుమ్ము లేవడం, కొన్ని క్షణాలు ఏమి జరిగిందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. కూలుతున్న సమయంలో ఎక్స్‌కావేటర్ డ్రైవర్ శశీ కిందకు దూకాడు. శిథిలాల్లో ఎక్స్‌కావేటర్ ముందు ఉన్న క్రేన్ అందులో ఇరుక్కుపోయింది. తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, పట్టణ సీఐ ఆకుల అశోక్, ఎస్సై సుగుణాకర్ పర్యవేక్షించారు.

ముందస్తు నోటీసులు ఇచ్చాం : కమిషనర్ సతీష్

డికొండ అన్నయ్య సర్వే నంబరు 40లో అనుమతులు తీసుకుని సర్వే నంబరు 42లో నిర్మాణం చేశారని కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు 2022 నుంచి పలు మార్లు నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులపై ఆయన స్పందించకపోవడంతో 15 రోజుల కిందట మరోసారి నోటీసు ఇచ్చామన్నారు. రెవెన్యూ అధికారుల నివేదిక ప్రకారం కూల్చివేశామన్నారు.

ఈ నెల 27న జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19: జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 27వ నుంచి జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలను నిర్వహిస్తామని డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ జాతి ప్రయోజనానికి సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై, ప్రపంచ నీటి సంక్షోభం, ఏఐ (అర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), విపత్తులను అరికట్టడంలో ఆధునిక సాంకేతికతలు, ఆరోగ్యం, పరిశుభ్రత, వాతావరణ మార్పు, దాని ప్రభావం అనే అంశాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని, పాల్గొనే వారి వివరాలను ఈ నెల 25వ తేదీ లోగా జిల్లా సైన్స్ అధికారి మధుబాబు సెల్ 9849550200ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19: మంచిర్యాల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలని, సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుధమల్ల హరికృష్ణ గురువారం మున్సిపల్ ఛైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రాన్ని అందించారు. జీహెచ్ఎంసీలో ఇస్తున్న వేతనాలను అమలు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని, జీవో నంబర్ 60 ప్రకారంగా డ్రైవర్లకు వేతనాలను అమలు చేయాలని, పేర్లు తప్పులు, పుట్టిన తేదీ సరిగ్గా లేదని 42 మంది కార్మికుల పీఎఫ్ డబ్బులను జమ చేయాలన్నారు. వయసు పై బడిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

మతం పేరుతో ప్రజలను విభజించేందుకు బీజేపీ కుట్ర


దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19: దేశ ప్రజలను మతం పేరుతో విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే తన్వీర్‌సింగ్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలు, ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా తీరును నిరసిస్తూ గురువారం బెల్లంపల్లి చౌరస్తాలో దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాహుల్‌గాంధీని హత్య చేస్తానని హెచ్చరించడాన్ని ఖండించారు. తన్వీర్‌సింగ్ వ్యాఖ్యలను బీజేపీ ఆక్షేపించపోవడం దారుణమన్నారు. దేశ సమైక్యతకు రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తే ప్రజలు అండగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతుందన్నారు. కులం, మతం పేరిట రాజకీయాలు చేయడాన్ని బీజేపీ మానుకోవాలని హితవు పలికారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మహిళా కాంగ్రెష్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కంపోజ్: కిరణ్‌కుమార్, మంచిర్యాల అర్బన్.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూరు, సెప్టెంబరు 19: శనగకుంట చెరువు మత్తడి ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నాయకుడు రాజారమేష్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెరువు మత్తడిని పేల్చడం హేయమైన చర్య అన్నారు. పోలీసులు విచారణ పేరుతో అధికార పార్టీకి చెందిన అసలు దోషులు కాంగ్రెస్ వదిలిపెట్టి అమాయకులను వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పట్టణంలో షాడో ఎమ్మెల్యేగా పేరున్న ఓ బడా నాయకుని కనుసన్నల్లోనే బ్లాస్టింగ్ జరిగిందన్నారు. మత్తడి ధ్వంసం కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపి ఎవరున్నా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయకట్టు రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నవాజుద్దీన్, కౌన్సిలర్లు రేవెల్లి మహేష్, దోమకొండ అనిల్, జగన్నాధుల శ్రీను, జోడు శంకర్, తుమ్మ రమేష్, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తడి పేల్చడం బాధాకరం : ఎమ్మెల్యే

శనగకుంట చెరువు మత్తడిని పేల్చడం బాధాకరమైన విషయమని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అనారోగ్య కారణాలతో శనగకుంట చెరువును సందర్శించ లేకపోయానని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని సంబంధిత పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సంఘ విద్రోహక చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఇంటింటి ఓటరు సర్వే పరిశీలన

గర్మిళ్ల, సెప్టెంబరు 19: ఇంటింటి ఓటరు సర్వేను గురువారం హైద్రాబాద్ సీఈవో కార్యాలయం డిప్యూటీ కలెక్టర్ ప్రసాద్ పరిశీలించారు. బీఎల్‌వోలు చేస్తున్న ఓటరు సర్వే రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. తప్పులు లేకుండా ఓటరు సర్వే చేపట్టాలని సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్పులు,చేర్పులు, చనిపోయిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించడం వంటి వాటిని పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆర్డీవో రాములు, డిప్యూటీ తహసీల్దార్‌సురేష్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఓటరు సవరణను సద్వినియోగం చేసుకోవాలని రాంప్రసాద్ అన్నారు. పలు వార్డుల్లో జరుగుతున్న ఓటరు సర్వేను పరిశీలించారు.

రియల్టర్ల ధన దాహం ప్రజలకు శాపం


బెల్లంపల్లి ఎర్రకుంట చెరువులో వెలిసిన వెంచర్ రోడ్డు



- ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో అక్రమ వెంచర్లు
- ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోతున్న ప్రజలు
- అక్రమ వెంచర్లలో లక్షలు వెచ్చించి ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వ చర్యలతో లబోదిబోమంటున్న బాధితులు

మంచిర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రియల్టర్ల ధన దాహం ప్రజలకు శాపంగా మారుతోంది. రియల్టర్ల మాయాజాలంలో చిక్కుకుని నిలువునా మోసపోతున్నారు. డబ్బు సంపాదనే లక్ష్యంగా తమ అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్న వ్యాపారులు అదును చూసి ప్రజల నెత్తిన కుచ్చుటోపీ పెడుతున్నారు. ఈ తతంగం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకొంది. జిల్లాలోని మారుమూల మండలాల ప్రజలేగాక, ఉద్యోగులు, వ్యాపారస్తులు శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందు కోసం అనువైన స్థలాలను కొనుగోలు చేస్తు న్నారు. దీన్ని ఆసరాగా తీసుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు అక్రమ దందాకు తెరలేపారు.

ప్రభుత్వ, శిఖం భూముల్లో వెంచర్లు....

జిల్లా కేంద్రంతోపాటు నస్పూర్, జైపూర్, చెన్నూరు, హాజీపూర్, లక్షెట్టిపేట, మందమర్రి, బెల్లంపల్లి, తాండూరు ఏరియాల పరిధిలో వెంచర్లు పుట్టుకు వస్తున్నాయి. ప్రభుత్వ, శిఖం, అసైన్డ్ భూముల్లో ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని ప్రజలకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థలాల పూర్వాపరాలు పరిశీలించని ప్రజలు వాటిని కొనుగోలు చేసి భవనాలు నిర్మించుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, చెరువులు, శిఖం, నాలాలు, నిషేధిత భూముల్లో వందల సంఖ్యలో భవనాలు దర్శనమిస్తాయి. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినప్పుడు మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

వెంచర్లు ఒకచోట..ప్లాట్లు మరోచోట

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇటీవల కొత్త పుంతలు తొక్కు తోంది. పట్టా భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేస్తున్న కొందరు వ్యాపా రులు ప్లాట్లను మాత్రం సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో చూపు తుండటం వెలుగు చూసింది. జిల్లా కేంద్రం లోని గోదావరి రోడ్డులో పట్టా భూమిలో వెంచర్ ఏర్పాటు చేసిన ఓ వ్యాపారి కస్టమర్లకు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో చూపెట్టడం వివాదాస్పదంగా మారింది. అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరు ప్రభుత్వ స్థలమని తెలియడంతో మున్సిపల్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇదే తంతు జరగడం విశేషం.

- నస్పూర్‌కు చెందిన ఓ వ్యాపారి కలెక్టరేట్ రోడ్డులోని సర్వే నెంబర్ 40లో ప్లాట్లు ఏర్పాటు చేశాడు. ప్లాట్లు కొనుగోలు చేసిన కొందరికి సర్వే నెంబర్ 42లో ప్లాట్లు చూపాడు. రిజిస్ట్రేషన్, ఇళ్ల పర్మి షన్ సమయంలో పట్టా భూమికి సంబంధించిన పత్రాలు జత చేయ డంతో అనుమతులు వచ్చాయి. ఇంటి నిర్మాణ స్థలం ప్రభుత్వ భూమి కావడంతో వివాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అనుబంధ టీబీజీకేఎస్ నాయకుడు ఢీకొండ అన్నయ్య భూమి కొనుగోలు పత్రంలో సర్వే నెంబర్ 40 ఉండగా, సర్వే సందర్భంగా అతను నిర్మించిన ఐదంతస్థుల భవనం ప్రభుత్వ భూమి అయిన సర్వే నెంబర్ 42లో ఉన్నట్లు తేలింది. దీంతో అధికారులు గురువారం భవనాన్ని నేలమట్టం చేశారు.
- అలాగే శ్రీశ్రీనగర్‌లో ఓ ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన రెండెక రాల వెంచర్‌లోనూ ఇదే తంతు జరిగింది. ప్లాట్లు విక్రయించే సమ యంలో సదరు వ్యాపారి సమీపంలోని పట్టా భూముల నెంబర్లు వేసి, రిజిస్ట్రేషన్లు చేశాడు. విషయం వెలుగు చూడటంతో అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు లబోదిబోమంటున్నారు. అయితే అధికారుల చర్యలకు స్థలాలు కొనుగోలు చేసిన వారే బాధ్యులవుతుండగా, ప్లాట్లు ఏర్పాటు చేసిన వ్యాపారులపై మాత్రం చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

యథేచ్ఛగా అనుమతులు

జిల్లాలో ప్రభుత్వ, చెరువు శిఖం భూముల్లో పలు వెంచర్లు, ఇళ్లకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్టీఎల్), చెరువు శిఖం, బఫర్ జోన్ల పరిధిలో యథేచ్ఛగా నిర్మాణాలు జరిగాయి. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోగల సర్వే నెంబర్ 45 ఎర్రకుంట చెరువు శిఖం భూమి కబ్జాకు గురైంది. 11 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉండగా సగానికిపైగా కబ్జా అయింది. పక్కనే వెంచర్ ఏర్పాటు చేసిన వ్యాపారులు శిఖం భూముల్లో రోడ్లు వేసి, విక్రయాలకు పాల్పడ్డారు. చెన్నూరులోని కుమ్మరి కుంట చెరువు 971 సర్వే నెంబర్‌లో 16.24 ఎకరాల్లో విస్తరించి ఉంది. విచ్చలవిడి కబ్జాల కారణంగా ప్రస్తుతం 2 ఎకరాలకే పరిమితమైంది. చెరువు భూముల్లో భవనాలు వెలిశాయి.

మందమర్రి మండలం చిర్రకుంటలోని లోత్‌రై చెరువు, ఆదిల్‌పేటలోని ఎర్ర చెరువులు కొంతభాగం కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. భీమారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 570లో 14.39 ఎకరాల విస్తీ ర్ణంలో ఊర చెరువు ఉంది. ఇందులో ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 6.29 ఎకరాల్లో పక్కా భవనాలు వెలిశాయి. మిగతా కొంత భూమిలో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని రాముని చెరువు, పోచమ్మ చెరువు, సాయికుంట, చీకటి వెలుగుల కుంటలు పెద్ద మొత్తంలో కబ్జాలకు గుర య్యాయి. రాముని చెరువును ఆనుకొని వెంచర్ ఏర్పాటు చేయగా బహుళ అంతస్థుల భవనాలు వెలిశాయి. రాముని చెరువుకు గతంలో హద్దులు ఏర్పాటు చేసినప్పటికీ శిఖం భూముల్లో వెలిసిన భవనాలపై చర్యలు తీసుకోలేదు.

అలాగే పోచమ్మ చెరువులో అధికభాగం కబ్జాలకు గురైంది. 67 ఎకరాలపై చిలుకు విస్తీర్ణం ఉన్న చెరువు చుట్టూ ఎఫ్టీఎల్ పరిధిలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగగా, బఫర్ జోన్లలో కూడా అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. హైటెక్‌సిటీ సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న చీకటి వెలుగుల కుంట దాదాపుగా కనుమరుగైంది. చెరువు చుట్టూ ఇళ్లు ఉండటం, మరోవైపు వెంచర్ ఏర్పాటైంది. సాయికుంట చెరువులోనూ అక్రమ కట్టడాలు వందల సంఖ్యలో వెలిశాయి. ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలిసినా అడిగేవారు కరువయ్యారు.



కబ్జాకు గురైన చెన్నూరు కుమ్మరికుంట చెరువు, జిల్లా కేంద్రంలో రాముని చెరువు చుట్టూ వెలిసిన భవనాలు

నాడు అనుమతులు.. నేడు నోటీసులు...

- ఇంటి నంబర్లు తొలగించిన అధికారులు - లబోదిబోమంటున్న బాధితులు - చెన్నూరు మున్సిపాలిటీలో గందరగోళం

చెన్నూరు, సెప్టెంబరు 19: చెన్నూరు మున్సిపాలిటీలో ఇంటి నంబర్ల కేటాయింపు వివాదాస్పదంగా మారుతోంది. పాలకవర్గ సభ్యులు, కొందరు సిబ్బంది మామూళ్ళు తీసుకొని గతంలో అనుమతులు ఇవ్వగా, ప్రస్తుతం అవే ఇంటి నిర్మాణ భూములకు నోటీసులు ఇవ్వడం గందరగోళంగా మారింది. నాడు సరైనది అన్న అధికారులు నేడు అక్రమమంటూ నోటీసులు ఇవ్వడం వెనక మతలబు ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. మామూళ్ళు ముట్టజెప్పి ఇంటి నంబర్లు పొందిన బాధితులు రికార్డుల్లో నంబర్ల తొలగింపుతో లబోదిబోమంటున్నారు.

పట్టణంలోని 840,863,853,869 సర్వే నెంబర్లలోని (గైరై) ప్రాంతంలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు రియల్టర్లు, అధికారులు కుమ్మక్కై కబ్జా చేశారు. కబ్జా భూములను అమ్మకానికి తెరతీయడంతో తక్కువ ధరకు భూములు వస్తున్నాయని పలువురు కొనుగోలు చేశారు. భూములు ఒకరి నుంచి ఒకరికి చేతులు మారాయి. అనంతరం అధికారులు, సిబ్బంది కుమ్మక్కై పలువురికి ఇంటి నంబర్లు కేటాయించారు. మున్సిపల్ అధికారులు భూముల క్రయ విక్రయదారుల నుంచి లక్షల నిధులు కాజేసి ఓపెన్ ప్లాట్లకు సైతం ఇండ్ల నిర్మాణాలు జరిగినట్లు నంబర్లు కేటాయించడం గమనార్హం.

-ట్యాంకు నిర్మాణం భూమి పూజతో వెలుగులోకి

పట్టణ వాసులకు తాగు నీరందించేందుకు అమృత్ 2.0 పథకంలో ఇటీవల కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ట్యాంకు నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు 840 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని కేటాయించారు. ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సమయంలో ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలు ఉండడంతో కలెక్టర్ వాకబు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని కలెక్టర్‌కు అధికారులు తెలపడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు.


సర్వే నంబరు 840లో వెలిసిన అక్రమ కట్టడాలు

-ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు తొలగించిన అధికారులు

కలెక్టర్ ఆదేశాలతో తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని మున్సిపల్ అధికారులు వెంటనే ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఇదే భూమిలో ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి నంబర్లు ఇచ్చిన అధికారులు తాజాగా 38 మంది యజమానుల ఇంటి నెంబర్లను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడం చర్చనీయాంశంగా మారింది.

గూడెం ఆలయ హుండీ లెక్కింపు

దండేపల్లి, సెప్టెంబరు 19: గూడెం సత్యనారాయణస్వామి ఆలయం హుండీలు లెక్కించగా రూ.8,44,666 ఆదాయం సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. గురువారం జూన్ నుంచి సెప్టెంబరు 18 వరకు 108 రోజులకు సంబంధించిన హుండీని దేవాదాయ దర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘుస్వామి, వేద పండితులు దుద్దిళ్ల నారాయణ శర్మ తెలిపారు. లెక్కింపులో సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


వందే భారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి


రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19 : వందే భారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని గురువారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మంచిర్యాల నుంచి చాలా మంది ప్రయాణికులు నాగ్‌పూర్, హైదరాబాద్‌కు ప్రయాణాలు సాగిస్తుంటారని, ప్రయాణికుల అవసరాన్ని గుర్తించి వందే భారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని వినతి పత్రంలో ఆయన కోరారు.

వరి పంట పరిశీలన

మందమర్రిరూరల్, సెప్టెంబరు 19: పొన్నారం గ్రామంలో వరి పంటలను చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. రైతులకు వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులకు పంటల విషయంలో ఏమైనా సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఏవో కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, కనకరాజు, రైతులు పాల్గొన్నారు.









దండేపల్లి, సెప్టెంబరు 19 : దండేపల్లి విద్యా వనరుల కేంద్రంలో గురువారం మండల ఇన్‌చార్జి ఎంఈవోగా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంఈవోగా విధులు నిర్వర్తించిన కాసుల రవీందర్ కరీంనగర్ జిల్లాకు

ఇన్‌చార్జి ఎంఈవోగా విజయ్‌కుమార్

బదిలీపై వెళ్లారు. డీఈవో ఆదేశాల మేరకు జన్నారం ఎంఈవోగా పని చేస్తున్న విజయ్‌కుమార్ మండల ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంఐసి నగేష్, సిఆర్‌పిలు నర్సయ్య, శ్రావణ్, రమేష్, రాజ్ మహ్మద్‌లు విజయ్‌కుమార్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు.



















జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

హాజీపూర్, సెప్టెంబరు 19: ముల్కల్ల గ్రామ శివారులోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మైసమ్మ గుడి సమీపంలో గురువారం మంచిర్యాల పట్టణానికి చెందిన ఇండ్ల రమేష్ (36) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమేష్ మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 19 : మాల గురిజాలకు చెందిన గోమాస శివ ప్రసాద్ (22) అనే యువకుడు చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు తాల్లగురిజాల ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శివప్రసాద్ సింగరేణి ఉద్యోగం చేసేవాడు. జూలై 3న మాల గురిజాల నుంచి రాత్రి విధులకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అక్కడ నుంచి హైద్రాబాద్‌కు తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లగా బుధవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి గోమాస రంజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు 19: బెల్లంపల్లిలోని తిరుమల్ హిల్స్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని రెబ్బెన మండలానికి చెందిన ఎస్‌కె చాంద్ (58) మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. మృతుడి కుమారుడు సాదిక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాసిపేట, సెప్టెంబరు 19 : కొండాపూర్ యాపకు చెందిన మక్కల వెంకటేష్ మద్యం మత్తులో బుధవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంకటేష్ దేవాపూర్ సిమెంట్ కంపెనీలో ఎక్స్‌కావేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజులుగా అధికంగా మద్యం సేవిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగగా కుటుంబీకులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నస్పూర్, సెప్టెంబరు 19 : నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా నగర్‌లో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులో తీసుకుని రూ. 30,970 రూపాయలు, 7 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు. గుమ్మడెల్లి భాస్కర్, రాజవరపు వెంకటేశ్వర్లు, తిప్పని సందీప్, ముద్దసాని సదానదం, దుర్గం శ్రీనివాస్, ఎల్క శ్రీధర్, ముద్దంగుల నాగరాజు, బొగే రమేష్, మాసు రాయలింగు ఉన్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

చెన్నూరు, సెప్టెంబరు 19 : మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి చెన్నూరు కోర్టు మెజిస్ట్రేట్ 7 రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 18న వాహనాలు తనిఖీ చేస్తుండగా కోటపల్లికి చెందిన ప్రేమ్‌సాగర్ మద్యం తాగి వాహనం నడుపుతు పట్టుబడడంతో కోర్టులో హాజరు పర్చగా జైలు శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరి అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, సెప్టెంబరు 19 : బలరావుపేట గ్రామ శివారు పొలంలో ఉద్దేశ్యపూర్వకంగా విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరు నిందితులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ అల్లం నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన నక్క ముజ్జన్న, బెడద బసవయ్యలు వారి పొలానికి ఎదురుగా ఉన్న రోడ్డును ఆక్రమించి సాగు చేస్తున్నారు. దీంతో మిగితా రైతులకు ఇబ్బందిగా ఉండడంతో ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. ఎంసీ కొలతలు వేసి ఇద్దరి పొలంలో హద్దురాళ్లు వేశాడు. బసవయ్య హద్దురాళ్ల వరకు రోడ్డు ఇవ్వడానికి అంగీకరించగా నక్క ముజ్జన్న అప్పటి జెడ్పీటీసీ ముత్తె సత్తయ్యకు చెప్పాడు. భూమి ఇవ్వవద్దని, రోడ్డుకు అడ్డంగా కరెంటు వైరు పెట్టి కనెక్షన్ ఇవ్వమని తెలిపాడన్నారు. షాక్ కొట్టే అవకాశం ఉండడంతో ఎవరు వెళ్లరని సలహాఇచ్చాడు. జూలై 31న రాత్రి ముజ్జన్న కరెంటు కనెక్షన్ పెట్టాడు. రైతుల ఫిర్యాదు మేరకు నక్క ముజ్జన్న, ముత్తె సత్తయ్యలను అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ సతీష్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో మోసపోతున్న చిరు వ్యాపారులు

కాసిపేట, సెప్టెంబరు 19: చిరు వ్యాపారాలు చేసే వారిని సైబర్ నేరగాళ్లు మోసగిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిరు దుకాణాల వద్దకు వెళ్లి నగదు అత్యవసరం ఉందని, డబ్బులను స్కాన్ చేసి పంపిస్తామని చెప్పి అడుగుతారు. వ్యాపారులు నగదు ఇచ్చి స్కాన్ చేయమని చెబుతున్నారు. స్కాన్ చేసి డబ్బులు పంపగానే సెల్‌ఫోన్‌కు మెసెజ్ వస్తుంది. బ్యాంకు ఖాతాలో నగదు జమ కాదు. ఎవరైనా అప్రమత్తమై బ్యాంకు ఖాతా చెక్ చేసుకుంటే కానీ బయట పడడం లేదు. కాసిపేట మండలంలో కొందరు దుకాణదారులు ఇలాగే మోసపోయారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో నగదు లావాదేవీలు నిర్వహించవద్దన్నారు. ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్వర్యంలో అవగాహన

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 19: జిల్లా కేంద్రంలోని వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవరణలో గురువారం లయన్స్ క్లబ్, లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో కేన్సర్, రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్ 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని, విద్యార్థులు రక్తదానం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. వి.మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లయన్ ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 19: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పోచమ్మ చెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. 14వ వార్డులో ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కౌన్సిలర్‌లు అస్మా షేక్, బొడ్డు నారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం

కాసిపేట, సెప్టెంబరు 19: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందని పీఆర్‌టీయూటీఎస్ జిల్లాగౌరవాధ్యక్షురాలు బండ శాంకరి అన్నారు. గురువారం తెలంగాణ మోడల్‌స్కూల్ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి పీఆర్‌టీయూటీఎస్ పోరాడుతుందన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం కొత్తగా పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చిన ఖలీల్‌ను సన్మానించారు. మండల అధ్యక్షుడు గంప శ్రీనివాస్, అన్నం రమణారెడ్డి, నాగేశ్వర్‌రావు, కృష్ణగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ కట్టడాలను తొలగించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని ఊరు మందమర్రి ఊర చెరువులో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి చెరువును రక్షించాలని కలెక్టర్ కుమార్ దీపక్‌కు గురువారం బీఎస్పీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ ముల్కల్ల రాజేంద్రప్రసాద్, రాజలింగులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 ఎకరాల ఉన్న చెరువు పది ఎకరాలకు పైగా కబ్జాకు గురైందని, అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వెంటనే చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించి అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు

చెన్నూరు, సెప్టెంబరు 19 : కోటపల్లి మండలం వెల్మపల్లి గ్రామంలోని గుర్రం సురేష్ పత్తి చేనులోని సోలార్ బ్యాటరీ, సోలార్ ప్లేట్ల దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్‌ఐ రాజేందర్ గురువారం తెలిపారు. నాలుగు రోజుల క్రితం గుర్రం సురేష్ పత్తి చేనులో అమర్చిన సోలార్ బ్యాటరీ, ప్లేట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని ఫిర్యాదు చేశారన్నారు. లక్ష్మీపూర్‌లో గ్రామంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. లక్ష్మీపూర్‌కు చెందిన రమేష్, మనోజ్, సిరొంచకు చెందిన కోట రాజేందర్‌లు దొంగతనం చేసినట్లు తేలడంతో కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

గాయపడిన కొండచిలువకు చికిత్స


నెన్నెలలో చికిత్స చేస్తున్న డాక్టర్ పావని

నెన్నెల, సెప్టెంబరు 19: నెన్నెలలో గురువారం తీవ్ర గాయాలతో ఉన్న కొండ చిలువకు వైద్యులు చికిత్స చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ భవనంలో ఎనిమిది అడగుల పొడవైన కొండ చిలువ కనిపించింది. హెడ్ కానిస్టేబుల్ విజయ్ ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. బెల్లంపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ రాజేష్‌ను పిలిపించారు. సిబ్బంది సహకారంతో రాజేష్ ఇనుపముళ్ల కంచెలో చిక్కుకున్న పామును పట్టుకున్నాడు. గాయమై రక్తం కారుతుండడంతో బెల్లంపల్లి పశు వైద్యశాలకు కొండ చిలువను తరలించారు. అక్కడి వైద్యురాలు డాక్టర్ పావని గాయానికి కుట్లు వేశారు. కొండచిలువకు ప్రాణాపాయం లేదని తెలిపారు. అనంతరం ఎల్లారం అడవిలో వదిలేసినట్లు కుశ్నపల్లి రేంజి అధికారి దయాకర్ తెలిపారు. చికిత్స అందించిన వైద్యురాలు పావని, స్నేక్‌క్యాచర్ రాజేష్‌ను, ఫారెస్టు సిబ్బందిని అధికారులు అభినందించారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

దండేపల్లి, సెప్టెంబరు 19: ఛలో ప్రజాభవన్ ముట్టడికి వెళ్ళకుండ మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. నాయకులు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవీందర్, యూత్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌యాదవ్, నాయకులు గోళ్ల రాజమల్లు ఉన్నారు.

జన్నారం : రుణమాఫీ మాట నిలబెట్టుకోవాలని రాష్ట్ర వ్యాప్త రైతులు ఛలో ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం ఉదయం జన్నారంలో తెలంగాణ ఉద్యమ కారుడు కమ్మల విజయ్‌ధర్మను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వెంటనే రైతులందరికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు.

జైపూర్: రైతుల రుణమాఫీ కోసం చేపట్టిన ప్రజాభవన్ ముట్టడికి వెళ్లకుండా మండల బీఆర్‌ఎస్ నాయకులను జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా భవన్ ముట్టడికి తమ బీఆర్‌ఎస్ పార్టీ పిలుపునివ్వలేదని , ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినా వినకుండా అక్రమంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు అయిన వారిలో బడుగు రవి, జగన్ గౌడ్, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

చెన్నూరు, సెప్టెంబరు 19: పట్టణంలో గురువారం మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ముస్లిం ఘనంగా జరుపుకున్నారు. జామా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పట్టణ పుర వీధుల గుండా ఐబీ ప్రాంతంలోని దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు రవీందర్, సుధాకర్, ఎస్‌ఐ శ్వేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ నవాజుద్దీన్ ఉన్నారు.

బెల్లంపల్లి: మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని పట్టణంలోని బజార్ ఏరియాలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మంచిర్యాల అర్బన్: మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఏర్పాట్లను సీపీ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్ రావు, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19: బీజేపీ సభ్యత్వానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని పట్టణాధ్యక్షుడు కుమారస్వామి, సభ్యత్వ నమోదు పరిశీలకులు బంగారు వేణులు తెలిపారు. గురువారం 18,19 బూత్‌లలో సభ్యత్వ నమోదు చేపట్టి పలువురికి సభ్యత్వం అందజేశారు. మోదీ పాలనకు ఆకర్షితులై పార్టీ సభ్యత్వం పెద్ద సంఖ్యలో తీసుకుంటున్నారని తెలిపారు. నాయకులు రాజమల్లు, దుర్గరాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 19: వానాకాలానికి సంబంధించి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రైసుమిలర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 3లక్షల29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం జిల్లాలోకి రాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా పౌరసరఫరా అధికారి బ్రహ్మారావు, అధికారులు సంజీవరెడ్డి, కిషన్, తిరుపతి, సంతోష్‌కుమార్, కల్పన, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలి

జిల్లాలోని రైసుమిల్లులకు కేటయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన మిల్లులపై చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో రైసుమిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30లోగా సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నూరు: మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుధ్య, అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ వార్డులు శుభ్రంగా ఉండేలా నిరంతరం పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల్లో చెత్తాచెదారం తొలగించాలన్నారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని రిజిష్టర్‌లు, రికార్డులు పరిశీలించారు. ధ్రువపత్రాల కోసం చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా అందించాలని, ధరణి పోర్టల్ ద్వారా భూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. కోటపల్లి మండలంలోని పీహెచ్‌సీ, కస్తూర్బా పాఠశాలను, పంచాయతీ కార్యాలయాలను సందర్శించారు. రికార్డులను, రిజిష్టర్‌లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

మావోయిస్టు వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (మావోయిస్టు) వార్షికోత్సవాలను ఈ నెల 21 నుంచి అక్టోబర్ 20 వరకు ఘనంగా నిర్వహించాలని కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లను స్వీకరించాలని, పార్టీని నిర్మూలించే లక్ష్యంతో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లొంగుబాట్లను, విప్లవ ద్రోహాన్ని వ్యతిరేకించాలని తెలిపారు. పీడిత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రంగాలకు విప్లవోద్యమాన్ని విస్తరింపజేయాలని పేర్కొన్నారు. 2004 సెప్టెంబరు 21న పార్టీ స్థాపన నాటి నుంచి 20 సంవత్సరాల్లో విప్లవ లక్ష్యసాధనలో కేంద్రకమిటీ సభ్యులు 22 మందితో సహా 5,249 మంది కామ్రేడ్లు తమ జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. ఇందులో వెయ్యి మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. సంవత్సర కాలంలోనే 218 మంది పార్టీ, పీఎల్‌జీఏ, ఐక్య సంఘటనలకు సంబంధించిన అమరులయ్యారని తెలిపారు. ప్రజా సంఘాన్ని నడపడానికి పార్టీ ఆర్గనైజర్లను ఏర్పాటు చేయడం, ప్రజా పోరాటాలను పెంపొందించడానికి తోడ్పడేలా, వాటిని సాయుధ పోరాటంతో అనుసంధానించేలా రాజకీయ, నిర్మాణాత్మక కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట, సెప్టెంబరు 19: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం, దాడికి పాల్పడిన నిందితుడిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 21న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు తెలిపారు. గురువారం దేవాపూర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైనూర్‌కు చెందిన ఆదివాసీ గిరిజన మహిళపై సంఘటన జరిగి రెండు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. బాధితురాలుకు న్యాయం చేయాలని ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిందితునికి కఠిన శిక్ష వేయాలని ఈ నెల 21న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. బంద్‌లో ఆదివాసీ గిరిజన, మహిళ సంఘాలు, ప్రజా సంఘాలు, వ్యాపారులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు భూమన్న, రాయిసెంటర్ ఉపమేడి కుంరం జనార్ధన్, ఆదివాసీ సేవ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, శ్రీను, సిడాం శంకర్, సిడాం రాందాస్, రంజిత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి

లక్సెట్టిపేటరూరల్, సెప్టెంబరు 19: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడంలో ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అర్పితమారంరెడ్డి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో అంగన్‌వాడీలకు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్ని కుటుంబాలతో ఉండే సత్సంబంధాల వలన ప్రజలకు చట్టాల గురించి నేరుగా అవగాహన కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి ఆడబిడ్డకు ఒక తల్లిగా, చెల్లిగా కూతురుగా పోషిస్తున్న పాత్రలు అదే విధంగా మగవారు కుటుంబాల కోసం చేస్తున్న త్యాగాలను అవగాహన చేసుకుంటే గొడవలే జరగవని వివరించారు. ఉత్తమ పౌరులుగా రాణించాలంటే చట్టాలతో పాటు స్వీయ నియంత్రణతో కూడిన ప్రవర్తన ఎంతో అవసరమన్నారు. మహిళల కేసుల విషయాల్లో పలువురు అంగన్‌వాడీ టీచర్ల అనుమానాలను నివృత్తిచేశారు. అనంతరం న్యాయవాదులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు అక్కల శ్రీధర్,జి.పద్మ, ఏజీపీ సత్యం, రవీందర్, ఎస్‌ఐ రాజయ్య, జూనియర్ అసిస్టెంట్‌లు నీరజ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

హాజీపూర్, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో మధుసూదన్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు, చేర్పులను ఈనెల 21లోగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు, తప్పులను సరిదిద్దడం వంటివి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జన్నారం: ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో శశికళ సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటరు జాబితా ముసాయిదా నిమిత్తం సమావేశం ఏర్పాటు చేసి సూచనలు చేశారు.

నెన్నెల: గుర్తింపు పొందిన పార్టీల అధ్యక్ష కార్యదర్శులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ముసాయిదా పోలింగ్ జాబితా ప్రదర్శన, మార్పులు చేర్పులపై ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఒకే బూత్ పరిధిలో ఉండే విధంగా ఓటరు జాబితాను రూపొందిస్తున్నామన్నారు.

మందమర్రిరూరల్: గ్రామపంచాయతీ ఎన్నికలపై ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీ సీఈవో గణపతి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే తెలియజేయాలన్నారు. ఎంపీడీవో రాజేశ్వర్ , ఎంపీవో అక్తర్ పాల్గొన్నారు.

వేమనపల్లి: పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ సయ్యద్ ఇష్తికార్ ఆలీ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

బెల్లంపల్లిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాపై కార్యాలయం సూపరింటెండెంట్ వేణుగోపాల్ సమావేశం నిర్వహించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని సూచించారు.

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఓటరు లిస్టు అభ్యంతరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గంగ మోహన్, నాయకులు గాధం లక్ష్మీనారాయణ, కొంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

బెల్లంపల్లి, సెప్టెంబరు 19: పట్టణంలోని సింగరేణి స్టోర్ దగ్గర వానరం రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న భజరంగ్ దళ్ యువకులు ప్రమాద స్థలానికి చేరుకుని చనిపోయిన కోతిని ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లి ఊరి చివరన ఉన్న శ్మశాన వాటికలో ఖననం చేశారు. భజరంగ్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు చింటు మనోహర్, అధ్యక్షుడు రచ్చ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు కంచి వేణు, పెట్టెం అశోక్‌లు పాల్గొన్నారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా అంజయ్య

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఊరు రామకృష్ణాపూర్ చెందిన కుదిరె అంజయ్య నియమితులయ్యారు. గురువారం జిల్లా నాయకులు ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, నర్సోజీ, గుడ్ల శ్రీనివాస్, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని ధర్నా


డిపో గేటు ఎదుట ధర్నాచేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19: ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, అశోక్, ఇజాజ్, శ్రీధర్, శ్రీనివాస్, లక్ష్మణ్, సురేష్, రాంకుమార్, ఆనంద్‌రావు, పోశం తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బెజ్జూరు, సెప్టెంబరు 19: మండలకేంద్రానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ ఇంట్లో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్‌లో మంటలు చెలరేగి స్వలంగా ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోనిసామగ్రి, నగదు బంగారం కాలిపోయాయి. సుమారు మూడు లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. గురువారం ఎమ్మెల్సీ దండెవిఠల్ సంఘటనస్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణసాయంకింద పదివేల నగదు అందజేశారు. ఎంఆర్‌ఐ అచ్యుత్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఎమ్మెల్సీవెంట నాయ కులు హర్షద్, శ్రీవర్ధన్, జావీద్‌అలీ, సురేష్‌గౌడ్, షణ్ముఖ, తిరుపతి, శేఖర్, శంకర్, బక్కయ్య, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



ఆసిఫాబాద్‌లో రాజకీయనాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలస్థాయి రాజకీయపార్టీల ప్రతినిధులతోఎంపీడీవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికసంస్థల ఎన్నికలు, ముసాయిదా ఓటరు జాబితా, తదితరాలపై చర్చించారు. ఏమైనఅభ్యంతరాలుంటే ఈనెల21లోగా కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అన్నిపార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తప్పులు సవరించుకోవాలి

బెజ్జూరు/దహెగాం/రెబ్బెన/వాంకిడి, సెప్టెంబరు 19: ఓటరు జాబితాలో ఏమైనా తప్పులుంటే సవరించుకోవాలని ఎంపీడీవోలు గౌరీశంకర్, రాజేందర్, శంకరమ్మ, వాంకిడిలో ఎంపీవో అజీజుద్దీన్ అన్నారు. గురువారం ఆయా మండలాల ఎంపీడీవో కార్యాలయాల్లో రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. తప్పుల సవరణకు ఈ నెల21న వరకు గడువు ఉందని ఆలోగా సరి చూసుకోవాలన్నారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రెబ్బెన, సెప్టెంబరు 19: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ వాసు అన్నారు. గోలేటి అంగన్వాడీ కేంద్రంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆయన పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి మురళి, ఏఎన్‌ఎం శైలజ ప్రమీల అంగన్వాడీ టీచర్లు సంధ్యారాణి, స్వర్ణలత, మంజుల, సుశీల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19: జిల్లా కేంద్రంలో ముస్లింలు గురువారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం జమా మసీద్, జన్కాపూర్‌మసీద్‌లలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్‌అహ్మద్, మౌలానాఆయాజ్, అష్రఫ్, నాయకులు బాసిత్, శంషాద్ హుస్సేన్, సాజిద్, రహెమాన్, నిసార్, యాహియా, అహ్మద్, తాజ్, ఖలీల్, అమర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: పట్టణంలోగురువారం మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమా మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీచైర్మన్ సద్దాం హుస్సేన్ ముస్లిం సోదరులకు పాయసాన్ని పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప, ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. పలుసంఘాల ఆధ్వర్యంలో మిఠాయిలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐలు శంకరయ్య, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎస్సైలు దీకొండ రమేష్, సుధాకర్ తదితరులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం గణపతి, మాజీమున్సిపల్ చైర్మన్ దస్తగీర్, అర్షద్, షబ్బీర్ హుస్సేన్, కౌన్సిలర్ వలీ, మోయిన్, తదితరులు పాల్గొన్నారు.


కాగజ్‌నగర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్ తదితరులు, ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

సిర్పూర్(టి): మండలకేంద్రంలో గురువారం మిలాద్‌ఉన్‌నబీ పండుగ ఘనంగా జరిగింది. ముస్లింలు మండలకేంద్రంలో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై కమలాకర్, మధుకర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించాలి

తిర్యాణి, సెప్టెంబరు 19: స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి మారుమూల ప్రాంతాల్లో మరిన్ని సేవలు అందించాలని పీఏసీఎస్‌చైర్మన్ అలీబీన్ అహ్మద్ అన్నారు.

గురువారం మండలంలోని ఉల్లిపిట్ట గ్రామంలో రామ్‌లీలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గం విమలానంద, దుర్గం దేవ్-నీలాబాయి వర్ధంతిని పురస్కరించుకుని వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ మల్లయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘంనాయకులు కరుణగౌడ్,ప్రసాద్, వైద్యసిబ్బంది నిర్మల,సంతోషి,ఆశావర్కర్‌భాగ్యలక్ష్మి, సోము బాయి, ఈశ్వరి, తానుబాయి తదితులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

సిర్పూర్(టి), సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సురే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివా హాలవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చిన్నతనంలో పెళ్లిలు చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రంజిత్, సూపర్‌వైజర్ దివాకర్, ప్రిన్సిపాల్ సదాశివ్ తదిత రులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఆన్‌లైన్ సేవలు

- అందుబాటులో లేని ఇంటర్‌నెట్
- నిలిచిన రిజిస్ట్రేషన్‌లు, ధ్రువపత్రాల ప్రక్రియ
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ప్రజలు



మీసేవ కేంద్రం

వాంకిడి, సెప్టెంబరు 19: మండలంలో మీసేవ కేంద్రాల ద్వారా కార్యకలాపాలు నిలిచిపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. జైనూర్ మండలంలో పదిహేనురోజుల క్రితం గిరిజనమహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం నేపథ్యంలో జరిగిన అల్లర్ల కార ణంగా ఈనెల4 అర్ధరాత్రి నుంచి ఉన్నతాధికారులు జైనూర్ మండలంతోపాటు వాంకిడి, తిర్యాని, లింగాపూర్, సిర్పూర్ (యు), కెరమెరి మండలాల్లో ఇంటర్‌నెట్ సేవలను నిలిపి వేశారు. దీంతో మీసేవాకేంద్రాల్లో లావాదేవీలు నిలిచిపోయాయి. 12రోజులనుంచి ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవడంతో రెవెన్యూశాఖకు సంబంధించిన సేవలన్ని స్తంభించాయి. భూముల రిజిస్ట్రేషన్‌తోపాటు జనన, మరణ ధ్రువపత్రాలు, విద్యార్థులకు ఉపకార వేతనాల దరఖాస్తు, ఉన్నత చదువులు, ఉద్యోగ దరఖాస్తులకు ఆదాయ, కుల, నివాసధ్రువపత్రాలు అవసరం ఉంటుంది. వీటి కోసం మీసేవ కేంద్రానికి వస్తున్న విద్యార్థులు ఇంటర్‌నెట్ సౌకర్యం లేక తిరిగివెళ్తున్నారు. వర్క్‌ఫ్రంహోం చేసే ఉద్యోగుల పనులు జరుగక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు మండలంలో ఇంటర్‌నెట్ సేవలు ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

అన్ని సేవలు నిలిచిపోయాయి

రాంబాబు, మీసేవా కేంద్రం నిర్వాహకుడు

12రోజుల నుంచి ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోవడంతో మీసేవా కార్యకలాపాలు స్తంభించాయి. ఆయా ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకునేందుకు, ఇదివరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధృవపత్రాలు డౌన్‌లోడ్ చేసేందుకు నెట్ సౌకర్యంలేక మేమేమీ చేయలేకపోతున్నాం.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరం

పెంచికలపేట, సెప్టెంబరు 19: మండలంలోని గిరిజన గ్రామాలైన మురళీగూడ, జిల్లెడగ్రామాల్లో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భం గా 136మందికి పరీక్షించి 24మందికిరక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌సతీష్, వైద్యసిబ్బంది అనర్థిహల్దార్, ధర్మారావు,నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఓంకార ఆశ్రమంలో అభిషేకం, ఆరాధన

చింతలమానేపల్లి, సెప్టెంబరు 19: మండలంలోని కర్జవెల్లి గ్రామంలోని గీతామందిరం ఓంకార ఆశ్రమంలో అభిషేకం, సద్గురువుల ఆరాధన కార్యక్రమాన్ని గురువారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు, గీతాపారాయణం నిర్వహించారు. అనంతరం అన్నదానకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులుపాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, సెప్టెంబరు 19: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన గుండు తిరుపతి(55) గురువారం జీవితంపై విరక్తి చెందిన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. లారీచౌరస్తా సమీపంలో ఉండే తిరుపతి ఎస్పీఎంలో విధులు నిర్వహిస్తున్నాడు. గుండు తిరుపతి కుమారుడు సాయికృష్ణగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

ఆసిఫాబాద్/వాంకిడి, సెప్టెంబరు 19: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని పాఠశాలల్లో, వాంకిడిమండలంలోని పలుపాఠశాలల్లో గురువారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే జీవో నెం.317 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, ఉపాధ్యా యులు హరీష్, ఎస్‌వో మీనాకుమారి, లక్ష్మి, శృతిక, హేమంత్, అనిత, హరిక, జ్యోతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టుల్లో ఇష్టారాజ్యం

- గురుకుల కార్యదర్శి జారీచేసిన ఉత్తర్వులు బేఖాతరు
- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు



ఆసిఫాబాద్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల

కాగజ్‌నగర్, సెప్టెంబరు 19: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో బోధించే కొంతమంది సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం రెండునెలల క్రితం రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించటంతో ఇన్నాళ్లు బోధించిన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులంతా బయటకు వెళ్లిపోయారు. అయినా కొన్నిఖాళీలు ఉన్నాయి. వీటిని తొలగించిన వారితోభర్తీచేయాలని రాష్ట్రకార్యదర్శి ఉత్తర్వులుజారీచేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మైనార్టీగురుకులాల్లో తొలగించిన వారిని ఎక్కడ ఖాళీలుంటే అక్కడ తీసుకున్నారు. కానీ జిల్లాలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది.

ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే..

ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ గణితం పోస్టులను ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీచేయటం పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులకు మెలికలు పెట్టినప్పుడు ఖాళీపోస్టులకు మాత్రం నేరుగా తీసుకోవటం ఏంటనీ అంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనారిటీ గురుకులాల సంస్థ కార్యదర్శి జారీచేసిన సర్క్యులర్‌ను పట్టించుకోకుండా, కొన్నేళ్లుగా పనిచేసిన వారిని తీసుకోవడంలో జాప్యం చేస్తున్న అధికారులు బాబాపూర్ పాఠశాలలో ఇద్దరిని గుట్టుచప్పుడు కాకుండా తీసుకోవడం వెనుక కొంత మంది వ్యక్తుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నియామకాలపై సమగ్రస్థాయిలో విచారణ జరిపి అర్హులకు ఇప్పించేలా చూడాలని తొల గించబడిన అభ్యర్థులు కోరుతున్నారు. అలాగే నాల్గవతరగతి ఉద్యోగుల నియమాకాలు కూడా జిల్లాకు చెందిన వారిని కాకుండా ఇతరులను నియమించారు. వీరిపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరుతున్నారు. బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండు చేస్తున్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

కెరమెరి, సెప్టెంబరు 19: ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు, రాయి సెంటర్ నాయకులు, పటేళ్లు, సర్‌మేడిలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు అభివృద్ధి చెందాలంటే చదువుకోవాలన్నారు. ప్రభుత్వంఅందజేసే ప్రతిఒక్క ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవా లని తెలిపారు. జిల్లాపోలీసులు శాంతిభద్రతల పరిరక్షణతోపాటు జిల్లాలోని ప్రజల, ఆదివాసుల అభివృద్ధికోసం అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు.ఎవరికైనా సమస్యలుంటే వాటిని శాంతియుతమార్గం ద్వారా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఏదైనా సమస్యఉంటే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, రాణాప్రతాప్, ఎస్సైలువిజయ్,ప్రశాంత్,రామారావు,తదితరులున్నారు.


రేపటి బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19: జైనూరులో ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిననిందితుడికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల21న తుడుం దెబ్బ ఆధ్వర్యంలో తల పెట్టిన రాష్ట్రబంద్‌ను జిల్లాలోని అన్ని మండలాల్లో విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకుడు విజయ్ కుమార్ తెలిపారు. ఈ బంద్‌కు అందరూ సంపూర్ణ మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని కోరారు.

ధరల మోత



- భారీగా పెరిగిన కూరగాయల ధరలు
- సలసలా కాగుతున్న వంటనూనెల రేట్లు
- ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు
- నియంత్రించాలని కోరుతున్న ప్రజలు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 19: ఇటీవల కురిసిన భారీ వర్షాలు కూరగాయల ధరలపై ప్రభావం చూపుతున్నాయి. వర్షాలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. వేసవితో పోలిస్తే ప్రస్తుత తరుణంలో ధరలు తక్కువగా ఉంటాయి. కానీ వర్షాల కారణంగా స్థానికంగా సాగుచేసిన కూరగాయలు, ఆకు కూరల పంటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు వరదల కారణంగా ఇతరప్రాంతాల నుంచి జిల్లాకు రావడానికి ఇష్టపడడం లేదు. చాలారకాల కారణాలతో ధరలు రెట్టింపయ్యాయి. గత నెలచివర్లో కూర గాయ మార్కెట్‌లో కిలో చిక్కుడుకాయ రూ.40 ఉంటే ప్రస్తుతం అది రెట్టింపు ధర పలుకుతోంది. పచ్చిమిర్చి కిలో 120పలుకుతోంది. గతంలో 60-80 ఉండేది. ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు పెరుగగా ఆకుకూరల పరిస్థితీ అలాగే ఉంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ధరలు పైపైకి..

కూరగాయలకు తోడు ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్నంటుతు న్నాయి. టమాటా కిలో రూ.50, క్యారెట్ కిలో రూ.120, కాకరకాయ కిలో రూ.80, బీరకాయ రూ.80, బెండకాయ రూ.40నుంచి 60, వంకాయలు కిలో రూ.60, గోరుచిక్కుడు రూ.60, ఉల్లిఆకు రూ.50, క్యాబెజీ కిలో రూ.60, మిరపకాయలు కిలో రూ.100, తోటకూర, గోంగూర రూ.50, కొత్తిమీర కిలో రూ.250 వరకు ధర పలుకుతోంది. దీంతో ఆయాకూరగాయలు కొనే పరిస్థితి లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

కస్టమ్స్ డ్యూటీ విధించడంతో..

ముడి పామాయిల్, సోయా, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 20శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధిస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. శుద్ధి చేసిన నూనెలపై ఉన్న దిగుమతి సుంకాన్ని 12.5నుంచి 32.2శాతానికి పెంచారు. అయితే విదేశాల నుంచి నూనెలు దిగుమతి అయిన తర్వాత రిఫైనరీలకు చేరుకొని, అక్కడ శుద్ధి చేసిన అనంతరం ప్యాకింగ్ పూర్తయి మార్కెట్లోకి రావడానికి కనీసం వారంరోజులు పడుతుంది. కానీ వ్యాపారులు మాత్రం ముందే ధరలు పెం చేశారు. రూ.108లీటర్ ఉన్న సన్‌ఫ్లవర్ రూ.130, లీటర్ 95ఉన్న పామాయిల్ రూ.115, లీటర్‌కు రూ.100 ఉన్న కాటన్ ఆయిల్ 120, రూ.170 ఉన్న పల్లినూనె రూ.210, మామూలు లోకల్ నూనెలు రూ.100 నుంచి 120కి పెంచేశారు. ముందస్తుగానే నూనెధరలు పెంచడంపై వినియోగదారులు భగ్గుమంటున్నారు.

కల్తీ దందా..

మార్కెట్లో కల్తీ నూనెల దందా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేరుశనగ గింజలు కొని గానుగ పట్టిస్తే లీటర్ పల్లినూనె ధర రూ.300 పై చిలుకు పలుకుతోంది. కానీ మార్కెట్లో మాత్రం వేరుశనగ నూనె పేరిట రూ.210కు విక్రయిస్తున్నారు. అంటే దానిలో కల్తీ ఉన్నట్లేనని వినియోగ దారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సన్‌ఫ్లవర్ నూనెదీ అదే పరిస్థితి. ఇక వంద రూపాయలకు లీటర్ చొప్పున అమ్ముతున్న నూనెలు దేని నుంచి తయారు చేస్తున్నరో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. అయితే కల్తీనూనెల వాడకంతో ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుంది. జిల్లాలో నూనె గిం జల సాగు తగ్గింది. నూనె గింజల సాగుకు మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి సివిల్ సప్లై ద్వారా వంటనూనెలు పంపిణీ చేయాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపి స్తున్నది. రేషన్‌షాపులను సూపర్‌మార్కెట్లుగా మారు స్తామన్న హామీలు నీటిమూటలుగా మారుతున్నా యి. కేవలం బియ్యం పంపిణీకి మాత్రమే రేషన్ దుకాణాలు పరిమితం అయ్యాయి.

నిర్దేశిత రుణ లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19: బ్యాంకర్లకు నిర్దేశించిన ప్రకారం రుణలక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 20024-25 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక సమీక్షసమావేశంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లాగ్రామీణాభివృద్ధి శాఖాధికారి దత్తారాం, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వర్‌జోషి, నాబార్డుఅధికారి వీరభద్రు దుతో కలిసి బ్యాంకర్లు, సెర్ప్, మెప్మా అధికారులతో రుణలక్ష్యాల సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికసంవత్సరంలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను సాధించి అర్హులైన ప్రతిఒక్కరికి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వయంసహాయక సంఘాల ఖాతాలకు బ్యాంకు లింకేజీలు పూర్తిచేయాలని తెలిపారు. ఇప్పటి వరకుజిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్‌యోజనపథకంలో 2,19748ఖాతాలు ఉన్నాయని, 103968ఖాతాలకు రూపే కార్డులు జారీ చేశామన్నారు. జిల్లా మొత్తం 6771 స్వయంసహాయక సంఘాలకు రూ.2275కోట్ల రుణ లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.777కోట్లు ప్రగతి జరిగిందన్నారు. సంబంధిత అధికారులు బ్యాంకుఅధికారులతో సమన్వయం చేసుకొని మిగితాలక్ష్యాన్ని సాధించే విధంగా కృషిచేయాలన్నారు. ప్రధానమంత్రి ముద్రరుణాలు రూ.15కోట్లు అందించామన్నారు. బ్యాంకర్లు, ఎస్సీ కార్పొరేషన్, గిరిజన యువతకు రుణాలు అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని మండలాలను ఆదర్శంగా తీర్చిదిద్దేలా మండలప్రత్యేకాధికారులు కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి సీఈవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జడ్పీ ప్రత్యేక సమావేశానికి అదనపుకలెక్టర్ దీపక్ తివారి, సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుకాతోకలిసి పాల్గొని మాట్లాడారు. మండలానికి సంబంధించిన రోజువారి అభివృద్ధి పనులకు సంబంధించి ప్రత్యేక ప్రొఫార్మా తయారుచేసినట్లు తెలిపారు. దీనిద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో మండలాల్లో అందుబాటులో ఉంటూ మండలాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మండలాల్లో బాగా పనిచేసే వారికి మెచ్చుకోవడంతోపాటు పనిచేయని వారిని శిక్షించాలని సూచించారు. అంతకుముందు అదనపుకలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారుల దృష్టి కేంద్రీకరించాలన్నారు. తాజాగా గ్రామ పంచాయతీ నిధులు మంజూరయ్యాయని వాటిని చెల్లించారా లేదా అనేది పరిశీలించాలని సూచించారు. ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ సిర్పూర్‌నియోజకవర్గంలో అటవీశాఖ అనుమతులు రాకపోవడంతో వచ్చినరోడ్లు రద్దుకానున్నట్లు ఆయన తెలి పారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 19: ఆదర్శ పాఠశాలల్లో శనివారం జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని పాఠశాలలో పనిచేస్తున్న 17మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా ఆయా స్థానాల్లో కేవలం ఇద్దరు మాత్రమే రావడంతో చదువులు అటకెక్కుతున్నాయని విద్యార్థులు రోడ్డెక్కారు. పాఠశాల నుంచి జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు పాదయాత్రగా వచ్చి ప్రధానరహదారిపై బైఠాయించి ఉపాధ్యాయులను నియమించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, డీఎస్పీ కరుణాకర్, సీఐ సతీష్ అక్కడికి చేరుకొని వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ విద్యార్థులు శాంతించలేదు. దాదాపు గంటపాటు రాస్తారోకో నిర్వహించిన తరువాత కొంత మంది విద్యార్థులను కలెక్టర్ వెంకటేష్ దోత్రే వద్దకు తీసుకెళ్లగా వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ పాఠశాల నుంచి వెళ్లిన ఉపాధ్యాయులు రావడానికి సిద్ధమైతే వారిని తిరిగి నియమిస్తామని లేదంటే తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు శాంతించి తిరిగి పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు విద్యార్థి సంఘాల నాయకులు కార్తీక్, చిరంజీవి మద్దతు తెలిపారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వాంకిడి, సెప్టెంబరు 19: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెచ్‌యూ రవిదాస్ సూచించారు. గురువారం మండలంలోని ఖమాన, గొల్లగూడ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త సారిక, దిలీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19: ఏరియాలోని కేకే5గనిలో మ్యాన్ రైడింగ్ పైనుంచి కిందపడి మృతిచెందిన లక్ష్మణ్ మృతిని గనిప్రమాదంగా గుర్తించి కోటిరూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగంఇవ్వాలని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య డిమాండ్ చేశారు. గురువారం వారుమాట్లాడుతూ యాజమాన్యం గనిప్రమాదంగా గుర్తించి మృతుడి కుటుంబానికి న్యాయంచేయాలని కోరారు. కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈవిషయంపై తమయూనియన్ సెక్రెటరీజనరల్ జనక్ ప్రసాద్ ఉపముఖ్యమంత్రి, సీఎండీలతో మాట్లాడారని తెలిపారు. నాయకులునరేందర్,సూర్యనారాయణ, సదయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గనిలోకి దిగిన పోలీసులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19: ఏరియాలోని కేకే5గనిలో గురువారం మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, పోలీసులు దిగారు. రెండు రోజుల క్రితం గనిలో మ్యాన్‌రైడింగ్ పైనుంచి కిందపడి లక్ష్మణ్ అనే కార్మికుడు మృతిచెందగా ప్రమాదస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈమేరకు వివరాలను సేకరించారు.

లాభాల వాటా చెల్లించాలని ధర్నా



వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19 : సింగరేణి కార్మికులకు లాభాల వాటా 35చెల్లించాలని కోరుతూ గురువారం మందమర్రి జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు జీఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మేడిపల్లి సంపత్, జె రవీందర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా గత సంవత్సరం లాభాల వాటాను చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే లాభాల వాటా చెల్లించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, తిరుపతి, అశోక్, రాజిరెడ్డి, ఈశ్వర్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.



ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ కమిటీ

జైపూర్, సెప్టెంబరు 19: ఏఐటీయూసీ ఐకే1ఏ, ఐకే ఓసీపీ మైనింగ్‌స్టాఫ్ పిట్‌కమిటీని గురువారం ఆర్గనైజింగ్‌సెక్రెటరీ మహ్మద్‌గౌసుద్దీన్, డిప్యూటిజనరల్‌సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్‌సెక్రెటరీ బాజీసైదా ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పిట్‌సెక్రెటరీగా జక్కుల వెంకటేష్, అసిస్టెంట్ సెక్రెటరీగా ప్రశాంత్, చీఫ్ ఆర్గనైజింగ్‌సెక్రెటరీగా హైమత్, రిలే ఏ ఆర్గనైజింగ్‌సెక్రెటరీగా సాయికృష్ణ, రిలేబీ సెక్రెటరీగానరేష్, సీరిలే సెక్రెటరీగా సాయిఅఖిల్, డీ రిలే సెక్రెటరీగా రత్నరాజ్, ఐకేపీ ఓసీపీ పిట్ సెక్రెటరీగా స్వరూప్, అసిస్టెంట్ సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా నరేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అఫ్రోజ్‌ఖాన్, నాగభూషణం, నవీన్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీకాంత్, బాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం: ఇన్‌చార్జి జీఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19: క్రీడలతో మానసిక వికాసం, శారీరక దృఢత్వం పొందవచ్చని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. సింగరేణి వార్షికక్రీడల్లో భాగంగా శ్రీరాంపూర్‌లోని ప్రగతిమైదానంలో కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాలకు చెందినజట్లు ఈపోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో ఆటల్లో రాణించి కోల్‌ఇండియాస్థాయిలో గెలుపొందడానికి కృషిచేయాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యపరిరక్షణలో భాగంగా యాజమాన్యం క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, అధికారులసంఘం అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు, క్రీడల గౌరవకార్యదర్శి కె సృజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

35శాతం లాభాల వాటా అందించండి..

లాభాలవాటా వెంటనే అందించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ డిమాండ్‌చేశారు. 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవలాభాలను వెంటనే ప్రకటించివాటా పంచాలని డిమాండ్ చేస్తూ జీఎం కార్యాలయం ఎదుట ధర్నాచేసి ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఆర్థిక సంవత్సరం ఈపాటికి లాభాలవాటా అందించేవారని, కానీ ఈసారి ఆర్థికసంవత్సరం ముగిసి ఆరునెలలైనా ఇంతవరకు డబ్బులు అందించకపోవడం శోచనీయమన్నారు. ఇది సరైన విధానం కాదని పేర్కొన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి వెంటనే 35శాతం లాభాలవాటా కార్మికులకు అందించాలని కోరారు. లేనిపక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్రచీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ లాల, నాయకులు రాజేశం, సంతోష్, మైపాల్ రెడ్డి, సుధాకర్, భాస్కర్, సంపత్, రవి, శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

- జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నీరజ్‌కుమార్ టిబ్రేవాల్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19: ఉద్యోగ జీవితంలో బీజీగా ఉన్న ఉద్యోగులకు క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా అటవీశాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా మైదానంలో అటవీశాఖ ఉద్యోగులకు నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్‌మీట్‌కు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖదేవ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జెండాఆవిష్కరించి జ్యోతిప్రజ్వలన చేసి క్రీడాకారులను పరి చయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో ఉద్యోగులకు కొంతఉపశమనం కలగడంతోపాటు మానసికశారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అటవీశాఖక్రీడాకారులు జోనల్‌స్థాయిలో పాల్గొంటారన్నారు. జిల్లావ్యాప్తంగా 200మంది వివిధస్థాయిలో అటవీ అధికారులకు క్రికెట్,వాలీబాల్,కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్, క్యారమ్స్, చెస్ తోపాటు అథ్లెటిక్స్‌పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో గిరిజన క్రీడాధికారిమీనారెడ్డి, ఎడీలు మధుసూదన్, తిరుపతి, రాకేష్, ఎఫ్‌ఆర్వోలు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సేవా సప్తాహం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రక్తదానం చేశారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యేతోపాటు బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీఎంపీపీ మల్లికార్జున్ రక్తదానంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యవం తులందరూ ప్రతి మూడునెలలకు ఒకసారి రక్తదానం చేయ వచ్చని, ప్రాణాలను నిలబెట్టిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చెన్నకేశ వరావు, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ నవీన్, నాయకులు సత్యనారాయణ, సుచిత్, అరుణ్, వీరభద్రాచారి, సొల్లు లక్ష్మి, సుహాసిని, సౌరబ్, తిరుపతి, ప్రసాద్‌గౌడ్, శ్రీకాంత్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు గంటల ప్రాతిపాదికన భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని టీజీఎంఎస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలి పారు. పీజీటీ తెలుగు, బోటాని, జువాలజీ,సివిక్స్, ఎకనామిక్స్‌,కామర్స్ పోస్టులకు ఎంఎస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ, ఎల్‌పీఎస్‌తోపాటు టెట్ పాసై ఉండాలన్నారు. టీజీటీ తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికోసం అర్హతలు ఎంఎస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ, డిగ్రీ బీఈడీ, టెట్‌పాసై ఉండాలన్నారు. వీరు 9వతరగతి నుంచి 12వతరగతి బోధిం చాలని, టీజీటీలు 6నుంచి 8వతరగతి వరకు బోధించాల న్నారు. అర్హతలు గల అభ్యర్థులు ఈనెల21 లోగా దరఖాస్తు చేసుకోవాలి టీజీఎంఎస్ ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉచిత శిక్షణకు..

వాంకిడి, సెప్టెంబరు 19: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా నిరుద్యోగ యువత నుంచి ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సభ్యులు రవి తెలిపారు. ఎలక్ట్రికల్, హౌజ్‌వైరింగ్, ప్లంబింగ్, శానిటేషన్ విభాగాలలో మూడు నెలల పాటు బెల్లంపల్లిలోని ఐటీడీఏ వైటీసీ కేంద్రంలో ఉచితశిక్షణ ఇస్తామన్నారు. 18నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.